క్లుప్తంగా

సాయినాథ వార్షికోత్సవం ప్రారంభం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సొలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథ ఆలయ 22వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు రాఘవేంద్రశర్మ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, నవగ్రహ ఆరాధన పూజలు చేశారు. ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ ఆధ్వర్యంలో అష్టదిక్పాల పూజ, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. సాయంత్రం సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మూడు గ్రామాల్లో పోలీసు కవాతు



ఫిరంగిపురం: సార్వత్రిక ఎన్నికల్లో శాంతియుతంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందస్తు చర్యల్లో భాగంగా మూడు గ్రామాల్లో ఆదివారం పోలీసు కవాతు నిర్వహించినట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు. తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం, శిరంగిపాలెంలో పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజలు స్వతంత్రంగా తమ ఓటును వినియోగించుకోవచ్చన్నారు. ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వీరనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: తాడికొండ సత్యసాయి పాఠశాలలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. బండ్ల కోటేశ్వరరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 118 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వీరిలో 87 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించి సిఫార్సు చేశారు. వీరికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి, ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించేందుకు తీసుకెళ్లనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండ్ల కోటేశ్వరరావు, ధూళిపాళ్ల ఏసుబాబు, ధనేకుల హరిబాబు, షేక్ రఫీ, శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వంశీ, పీఆర్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 2,79,290లు నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డు చెక్‌పోస్టులో వాహనాల సాధారణ తనిఖీ నిర్వహిస్తుండగా ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.2,79,290 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు తెలిపారు. గుంటూరుకు చెందిన ఆంద్ర శ్రీనివాసరావు అనే వ్యక్తి గుంటూరు నుంచి అమరావతి వైపు వెళ్తుండగా తనిఖీలో నగదు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించి, సదరు నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు వారు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఒక్కో వ్యక్తి రూ.50 వేలలకుపైడి నగదు, రూ.10 వేలకు పై బడిన బంగారు ఆభరణాలు, ఎలాంటి రసీదులు లేకుండా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు.

రచ్చబండ కోసం నగదు పంపిణీ..?

మంగళగిరి: నారా లోకేష్ ప్రచారంలో జనాలు రాకపోవడంతో నగదు పంపిణీ చేసి మరీ తరలిస్తుండడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. ఆదివారం మంగళగిరి పట్టణంలోని పాత మంగళగిరి లూథరన్ చర్చి అంబేడ్కర్ విగ్రహం వద్ద రచ్చబండ నిర్వహించారు. రచ్చబండ కోసం జనాలను తరలించేందుకు ఒక్కొక్కరికి రూ.2000 చెల్లించినట్లు స్థానికులు చర్చించుకున్నారు. ఇప్పటికే తాయిలాలు పంపిణీ చేస్తుండగా.. తాజాగా నగదు పంపకం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

రూ.లక్ష నగదు పట్టివేత

తెనాలిరూరల్: కారులో తరలిస్తున్న రూ.లక్ష నగదును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లాకు చెందిన వ్యక్తి తన కారులో రూ.లక్ష నగదుతో తెనాలి నుంచి అంగలకుదురు వైపు వెళుతుండగా జేఎంజే కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద త్రీటౌన్ పోలీసులు కారును తనిఖీ చేశారు. డ్యాష్ బోర్డులో లక్ష నగదు ఉండగా స్వాధీనం చేసుకుని నగదుకు సంబంధించిన పత్రాలు తీసుకురావాలని సదరు వ్యక్తికి తెలిపారు. నిబంధనలకు మించి ఎవరూ నగదును తరలించకూడదని సీఐ ఎస్.రమేష్‌బాబు తెలిపారు.

చేరికలతో వైఎస్సార్ సీపీలో జోష్..



పార్టీలో చేరిన జనసేన నాయకులతో లావణ్య, కాండ్రు కమల



లావణ్యను అభినందిస్తున్న బీసీ సంఘాల నాయకులు

- పార్టీ కండువాలు కప్పుకున్న జనసేన నాయకులు
- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య

మంగళగిరి: జనసేన పార్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం ఎమ్మెల్సీ హనుమంతరావు నివాసంలో వారిని వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పఠాన్ అష్రఫ్ ఖాన్ ఆధ్వర్యంలో స్వర్ణకారులు పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు మురుగుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల మద్దతు..

ఎమ్మెల్సీ హనుమంతరావు నివాసంలో లావణ్యకు బీసీ సంఘాలు మద్దతు పలికాయి. నియోజకవర్గంలోని సంఘాల నాయకులు ఆమెను కలిశారు. లావణ్య గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు పారేపల్లి మహేష్, ఉడతా శ్రీనివాసరావు, తిరువీధుల కిరణ్, కాగితాల స్వాతి గౌడ్, మాదు నాగదుర్గ, యనమల నరసింహరావు, జి.విజయలక్ష్మి, జంజనం ప్రసాద్, ఇసునూరి నగేష్ పాల్గొన్నారు. మురుగుడు సత్యం, కాండ్రు శివనాగేంద్రం, కొల్లి వాసు, కాండ్రు చక్రవర్తి, కొల్లి సత్యం ఉన్నారు. అలాగే నగర పరిధిలోని కాజ ఎస్సీ కాలనీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పార్టీలో చేరిన వారికి.. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.శేషు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు



పార్కు రోడ్డులోని హోలి లార్డు పెంథుకోస్తు చర్చిలో..

తాడికొండ: తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని పలు చర్చిల్లో మంట పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఈత మట్టలను పూలతో సుందరంగా అలంకరించి, ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు శిలువ మరణానికి ముందు ఆదివారం యెరుషలేము పట్టణంలో భారీగా ఊరేగించి మట్టలతో స్వాగతం పలుకుతూ పండుగను నిర్వహించారు. దానికి ప్రతీకగా మట్టల ఆదివారం పండుగను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా.. పాస్టర్లు సందేశం అందించారు.

భక్తిశ్రద్ధలతో మట్టల పండగ

మంగళగిరి: నగరంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు చర్చిల నుంచి పాస్టర్లు, దైవ సేవలు, చిన్నారులు ఈత మట్టలతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తాడేపల్లి క్రిస్టియన్ పేటలోని చర్చి, మంగళగిరి పార్కు రోడ్డులోని హోలి లార్డు పెంథు కోస్తు చర్చితో పాటు పలు చర్చిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, మట్టలతో ర్యాలీలు నిర్వహించారు.



తాడేపల్లి క్రిస్టియన్ పేట చర్చిలో..

వైభవం.. తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవం

- కంతేరు నుంచి కొప్పురావూరుకు.. కుంకుమ బండ్లతో తరలివచ్చిన భక్తులు

పెదకాకాని: లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామివారి తిరునాళ్ల మహోత్సవం కనుల పండువగా జరిగింది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి తిరునాళ్లను పురస్కరించుకుని ఆదివారం ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయ చైర్మన్ పల్లెల మధు, కమిటీ పర్యవేక్షణలో అర్చక స్వామి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం 5 గంటలకు మహాగణపతి పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అఖండజ్యోతి ప్రదక్షిణ, అష్టోత్తర శత నామార్చన పూజలు జరిపించారు. ఆలయానికి వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు గోత్రనామ పూజలు జరిపించుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి పొంగళ్లు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 11 గంటలకు కంతేరు గ్రామం నుంచి ఎండబండ్లపై పుట్టింటి సారెగా పసుపు, కుంకుమలు, పూజా సామగ్రితో వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు జరిపించారు. కనక తప్పెట్లు, పార్వతీ పరమేశ్వరుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ వెంట మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, బందెల ఉదయ్‌శంకర్, తదితరులు ఉన్నారు. ఆలయ ప్రాంగణం విద్యుత్‌దీప కాంతులతో కళకళలాడింది.



లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారికి హారతులిస్తున్న అర్చకుడు శ్రీనివాసరావు



విద్యుత్ కాంతులీనుతున్న తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఆలయం



ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అంబటి మురళీకృష్ణ

క్షయపై అవగాహన కలిగి ఉండాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మల్లికార్జునరావు

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యశాల ఆర్ఎంవో డాక్టర్ పి.మల్లికార్జునరావు సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవ ర్యాలీని మార్తా గ్రూప్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా వైద్యశాల వద్ద నిర్వహించారు. ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన విభాగ వైద్యాధికారి డాక్టర్ కలగొట్ల రాధిక మాట్లాడుతూ క్షయ వ్యాధి ఊపిరితిత్తులు, చర్మం, ఎముకలకు వ్యాపించే అవకాశం ఉందన్నారు. ఊపిరితిత్తులకు అది వ్యాపిస్తే అత్యంత ప్రమాదంగా భావించాలని చెప్పారు. వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ రెహమాన్, మార్తా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ వై.ఈశ్వర్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, హెచ్‌వీలు ప్రసన్న, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం

పట్నంబజారు: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళదాస్‌నగర్‌లో నివాసం ఉండే చుండూరి నాగరాజు దుస్తులు ఉతికే పని చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు అధికమై ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల నివాసాల్లో కుటుంబసభ్యులు అడిగినప్పటికీ ఆచూకీ దొరకలేదు. దీంతో నాగరాజు భార్య రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 8688831325, 8688831329 నంబర్లకు సమాచారాన్ని అందించాలని పోలీసులు కోరారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌కు షోకాజ్ నోటీసులు

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ పరిధిలో ఆన్‌లైన్ ద్వారా ఎన్నికలకు సంబంధించి అందిన ఫిర్యాదులపై నిర్దేశిత సమయంలోపు స్పందించడంలో జాప్యంపై ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంకు శనివారం నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పటిష్టంగా అమలు చేయడానికి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గంలో 24 గంటలు అందుబాటులో ఉండేలా మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో షిఫ్ట్ రెండో బృందం ఆన్‌లైన్ ద్వారా అందిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కారం చేయడంలో జాప్యం చేశారని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పి.ఉమాదేవి, ఎం.ప్రమీల, కె.మహేష్, ఎస్.శ్రీనివాసరావు, వి.ఇందిరలకు 24 గంటల్లో వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, అంకితభావంతో పని చేయాలని ఆదేశించారు.

దుగ్గిరాల ఆరోగ్య కేంద్రం డాక్టర్‌కు అవార్డు



మంగళగిరి: టీబీ నివారణకు కృషి చేసిన దుగ్గిరాల ఆరోగ్య కేంద్రం డాక్టర్ మహమ్మద్ ఇజాజ్ అబ్దుల్ రహమాన్‌కు అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం అంతర్జాతీయ క్షయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ వైద్యాధికారిగా ఎంపికయిన అబ్దుల్ రహమాన్ తెనాలి జిల్లా వైద్యశాలలో జాతీయ క్షయ ఎలిమినేషన్(ఎన్‌టీఈపీ) కార్యక్రమంలో వైద్యశాల ఆర్ఎంవో డాక్టర్ మల్లికార్జున, టీబీ కంట్రోల్ వైద్యాధికారి డాక్టర్ రాధిక చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. మండలంలోని మేరికపూడి గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మస్తాన్‌దర్గా వద్ద కొబ్బరికాయ కొట్టి, ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం కాలనీ, ఎస్టీ కాలనీ, ప్రధాన రహదారి వద్ద ప్రజలతో మమేకమై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ తన పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని, తీర్చారని చెప్పారు. మధ్యవర్తులతో పనిలేకుండా అర్హులైతే చాలు పథకాలు అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ప్రజలు గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచి కె.పద్మావతి, కె.బ్రహ్మారెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పి.వెంకట్రామిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, వీరారెడ్డి, డి.మెల్కియా, షేక్. గౌస్, పి.చిన్నా, ఖాజావలి, ఎం.సుధాకరరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి పాల్గొన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో సాయంత్రం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పాల్గొన్నారు. జి. ఆదంబీ, మస్తాన్‌వలి, ఖాజావలి, మస్తాన్‌వలి, నాయకులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గురుమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల విశ్రాంత ఉద్యోగులకు ఇస్తున్నట్లే జనరల్ ఇన్సూరెన్స్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్, ఇతర సదుపాయాలు కల్పించాలని పెన్షనర్ల సంఘం జాతీయ నాయకుడు గురుమూర్తి కోరారు. ఆదివారం అమరావతిరోడ్డులో జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ రెండవ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గురుమూర్తి మాట్లాడుతూ సాధారణ బీమా సంస్థలను విలీనం చేసి, పరిశ్రమకు రక్షణ కల్పించాలని కోరారు. సాధారణ బీమా ఉద్యోగుల వేతన వేతన సవరణను సత్వరమే చేయాలనే డిమాండ్‌తో కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నట్లు వివరించారు. సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో సాధారణ బీమా మహిళా పెన్షనర్స్ సంఘం సామాజిక బాధ్యతతో చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్లు ఇందిరా ప్రేమజ్యోతి, శారదను ఘనంగా సత్కరించారు. సాధారణ బీమా పెన్షనర్లకు ఉద్యోగులకు జీతాలు పెరిగినప్పుడు పెన్షన్ అప్డేషన్‌తో పాటు ఫ్యామిలీ పెన్షన్ 30 శాతానికి పెంచాలని జిల్లా సాధారణ సర్వసభ్య సమావేశ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. గద్దె పానకాలరావు అధ్యక్షతన జరిగిన సభలో కార్యదర్శి మన్నవ సాంబశివరావు నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. సుబ్బారావు, కార్యదర్శి సాల్మన్ రాజు, కోశాధికారి కృష్ణారావు, ఆదినారాయణ, వై.చిన్నపరెడ్డి, జిల్లా విశ్రాంత ఉద్యోగులు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాలు



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న అతిథులు, ఆలయ కమిటీ సభ్యులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా ఆదివారం మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, నిత్య హోమం, సామూహిక, విష్ణు, లలితా సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణలు నిర్వహించారు. విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ స్వహస్తాలతో హోమ పూర్ణాహుతి అనంతరం వేల సంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య అధ్యక్షత వహించారు. శ్రీవశిష్ఠాశమం ఉత్తరాధికారి శ్రీ విశ్వంభరానందగిరిస్వామి, శేషాచలాశ్రమం పీఠాధిపతి శ్రీ నిర్వకల్పానందస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. సాహితీవేత్తలు యాబలూరి లోకనాథశర్మ, నిష్టల సుబ్రహ్మణ్యశాస్త్రి, నారాయణం ప్రసాదాచార్యులు, నోరి నారాయణమూర్తి బ్రహ్మోత్సవాల విశిష్టతను తెలిపారు. సభలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, మండవ వెంకట రామయ్య దంపతులు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధి అవసరం



మాట్లాడుతున్న వడ్లమాని రవి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని రోటరీ ఇంటర్నేషనల్ బోర్డు డైరెక్టర్ వడ్లమాని రవి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్లమాని రవి మాట్లాడుతూ విద్యార్థులు తమలోని సృజనాత్మక నైపుణ్యాల్ని గుర్తించి, అధ్యాపకుల సహకారంతో వాటిని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. విద్యావంతులుగా, నైపుణ్యవంతులుగా ఎదిగి, తల్లిదండ్రులతో పాటు చదువుకున్న కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో వార్షికోత్సవం ఒక మరపురాని ఘట్టమన్నారు. ప్రతి విద్యార్థి కళాశాల నుంచి ఎన్నో మంచి విషయాలను నేర్చుకుని భవితకు పునాది వేసుకుంటారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యారంగంలో హిందూ కళాశాల ఒక ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందన్నారు. సమాజంలో ఉన్నతస్థాయిలో రాణిస్తున్న ఎంతో మంది ప్రముఖులకు విద్యాసంస్థలు విద్యను బోధించాయని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. సుబ్బారావు, మేనేజ్‌మెంట్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



పూజలు చేస్తున్న మహిళలు

పట్నంబజార్: పాత గుంటూరు సుద్దపల్లి డొంకలో ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్యస్వామి కల్యాణం మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం పసుపు, కుంకుమ ఎడ్ల బండ్ల ఊరేగింపు వైభోవపేతంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తలారి రాము, పున్నారావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, పాదిల మహేష్, బిచ్చాల కృష్ణ, వాసు, కడియాల శ్రీనివాసరావు, బుజ్జి పాల్గొన్నారు. సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.